క్లుప్తంగా

15, 17 తేదీల్లో ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు

రావికమతం/రోలుగుంట: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 15న నైతికత–మానవీయ విలువల విద్య, 17న పర్యావరణ విద్య అనే అంశాలపై పరీక్షలు నిర్వహిస్తున్నామని కొత్తకోట, రోలుగుంట కళాశాలల ప్రిన్సిపాళ్లు సాయికుమార్, సహదేవుడు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఆదేశాల మేరకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే వారికి మాత్రమే ద్వితీయ సంవత్సరం ప్రవేశం ఉంటుందన్నారు. గైర్హాజరైన వారికి తుది మార్కుల జాబితా ఇవ్వబోమని సూచించారు.

యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా షేక్ హజార్



నూతన కార్యవర్గం

మాడుగుల రూరల్: యూటీఎఫ్ మండలాధ్యక్షుడిగా షేక్ హజార్, ప్రధాన కార్యదర్శిగా డి. వంశీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఎం. కోటపాడు పాఠశాలలో జిల్లా ఉపాధ్యక్షుడు పోలిమేర చంద్రరావు ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎస్. జగ్గారావు, ఉపాధ్యక్షులుగా ఆర్. లావణ్య, ఎస్. శివ, కోశాధికారిగా ఎ. అప్పారావు, జిల్లా కౌన్సిలర్లుగా పి. చంద్రరావు, కె. రమేశ్, కె. సత్తిబాబు, ఎస్. కొండలరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీని పలువురు ఉపాధ్యాయులు, హెచ్ఎం చందోలు వెంకటేశ్వరరావు అభినందించారు.

సత్యవరంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం


కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం


మాడుగుల: సత్యవరంలో విద్యుత్ సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరిస్తున్నారు. ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి ఈ సమస్యను గ్రామస్తులు తీసుకొచ్చారు. ఆయన ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో లైన్‌మన్ బుజ్జితోపాటు సిబ్బంది మంగళవారం గ్రామంలో విద్యుత్ తీగలు సరిచేయడంతోపాటు పాడైన పాత స్తంభాలు స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

120 మందికి నేత్ర పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న ఆప్తాలమిస్ట్ సీతారామ్

మాడుగుల: జమ్మాదేవి పేటలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు కంటి సమస్యలున్న 120 మందిని పరీక్షించారు. వీరిలో 20 మందిని శస్త్ర చికిత్సలకు, 25 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, ఆప్తాలమిస్టులు సీతారామ్, సూర్య, సంధ్య, భవాని, భారతి, కోఆర్డినేటర్ స్వాములు పాల్గొన్నారు.

ఆశాజనకంగా టమాటా సాగు


గవరపాలెంలో టమాటా పంట

కె.కోటపాడు: మండలంలో టమాటా సాగు ఆశాజనకంగా ఉంది. కె.కె.అగ్రహారం, ఆర్లి, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, అర్లి, సూదివలస, దాలివలస, మర్రివలస, పాతవలస, గవరపాలెం గ్రామాల్లో 400 ఎకరాల్లో సాగవుతోంది. ప్రధానంగా మార్కెట్‌లో టమాటాకు మంచి ధర లభిస్తోంది. తక్కువ పెట్టుబడితో పాటు అధిక దిగుబడి రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



హోరాహోరీగా ఎడ్లబళ్లు, గుర్రం పరుగు పందేలు

- వరదేశమ్మ పండగ సందర్భంగా జిల్లా స్థాయి పోటీల నిర్వహణ
- ఎడ్ల బళ్ల పోటీల విజేత కేజే పురం, గుర్రం పందెం విజేత శ్రీరాంపట్నం

చోడవరం : జిల్లా స్థాయి ఎడ్లబళ్లు, గుర్రం పరుగు పందేలు మంగళవారం హోరాహోరీగా జరిగాయి. మండలంలోని దామునాపల్లి గ్రామ దేవత పరదేశమ్మ అమ్మవారి పండగ మహోత్సవం సందర్భంగా సర్పంచ్ బలిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎడ్లబళ్లు, గుర్రపు పరుగు పందేలు నిర్వహించారు. ఎడ్లబళ్ల పరుగు పందేల్లో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 28 ఎడ్లబళ్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతుల్ని కేజే పురానికి చెందిన కొయిలాడ మోహన్‌కు చెందిన రెండు ఎడ్ల బళ్లు గెల్చుకున్నాయి. తృతీయ బహుమతి అద్దెపల్లి పాల(చుక్కపల్లి) ఎడ్లు గెలుచుకున్నాయి. నాల్గో స్థానంలో ముదుకుర్తి శంకరరావు (డి.కొత్తూరు), ఐదోస్థానంలో మరిడిమాంబ ఎడ్ల బళ్లు నిలిచాయి.
అదేవిధంగా జిల్లాస్థాయి గుర్రపు పరుగు పందేల్లో నువ్వానేనా అన్నట్టుగా గుర్రాలు దౌడుతీశాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 21 గుర్రాలు ఈ పోటీలో పాల్గొన్నాయి. మేలు జాతి గుర్రాలు పోటీకి దిగడంతో హోరాహోరీగా తలపడ్డాయి. శ్రీరాంపట్నంకు చెందిన బాలాజీ ఠాగూర్ గుర్రం మొదటి బహుమతి కైవసం చేసుకుంది. సింగపూర్ సత్యం జ్వాల గుర్రం రెండో బహుమతి, ఎస్.సత్యనారాయణ స్వామివార్ గుర్రం ద్వితీయ బహుమతి దక్కించుకున్నాయి. చోడాంబిక విక్రమ్ గుర్రం మూడో బహుమతి, గుమ్మిడి గణేష్ సీమ గుర్రం నాల్గో బహుమతి గెల్చుకున్నాయి. వీరికి సర్పంచ్ బలిరెడ్డి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ బలిరెడ్డి సత్యారావు బహుమతులు అందజేశారు.


పోటీల్లో పరుగు తీస్తున్న ఎద్దు


పోటీల్లో దౌడుతీస్తున్న గుర్రం

నేడు జిల్లా స్థాయి గుర్రపు పందేలు

చోడవరం రూరల్: శ్రీరాంపట్నంలో బుధవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు, గుర్రపు పరుగు పందేలు నిర్వహించనున్నారు. ఇక్కడ దుర్గాంబిక అమ్మవారి తీర్థం సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కబడ్డీ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే గుర్రపు పరుగు పందేల్లో వరుస స్థానాల్లో నిలిచిన వాటికి రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున బహుమతులుగా అందజేస్తామన్నారు. వంద రూపాయల నామినేషన్ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

సస్యరక్షణ చర్యలతో మామిడిలో అధిక దిగుబడులు

మండల ఉద్యానవనశాఖాధికారి భాను పుష్పలీలావతి



మాడుగుల రూరల్: మామిడి పూత, పిందె దశలో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల ఉద్యానవన శాఖాధికారి వి. భాను పుష్పలీలావతి సూచించారు. ఈ మేరకు మామిడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గుర్తించి ఆమె వివరించారు. పూత దశకు ముందు చెట్లుకు సల్ఫేట్ మూడు గ్రాములు, మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీ లీటరు మందులో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మొగ్గ దశ ఐదు నుంచి పది శాతం వచ్చినప్పుడు సస్యరక్షణ చేపట్టాలని, ప్రధానంగా సాఫ్ 1.5 గ్రాములు, కానుగ నూనె 7.5 గ్రాములు, బోరాన్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. తర్వాత మామిడి పచ్చిపూత సమయంలో హిడోలోపెయిడ్ 0.5 మిల్లీ లీటరు మందును పిక్స్‌కోన్‌బోల్ రెండు వందల మందును పిచికారీ చేయాలన్నారు. ఇలా చేస్తే పూత నిలబడుతుందన్నారు. వీటితోపాటు తెల్ల పూత వస్తే ఎటువంటి మందును స్ప్రే చేయనవసంరలేదన్నారు. నల్లపూత వస్తే అనిఫేట్ ఒక గ్రాము, ఐకో ఒక గ్రాము పిచికారీ చేయాలని, దీంతోపాటు జొన్న గింజ ఆకారంలో పూత వస్తే ఫెప్రోనిల్ రెండు గ్రాములు, అంత్రాకాల్ రెండు గ్రాములు, పూతపై మైక్లోబడానిల్ ఒక గ్రాము కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బఠాణీ గింజ ఆకారంలో పువ్వు వస్తే ప్లోనోఫిక్స్ 0.25 మిల్లీ లీటరు మందుతోపాటు అనిపేట్ మందును పిచికారీ చేసుకోవడం ద్వారా పిందె నిలబడుతుందన్నారు. పొగమంచు వల్ల పూత రాలకుండా పైన పేర్కొన్న సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వివరించారు.

38 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

నాతవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న భూ రీసర్వేకు సంబంధించి మండలంలోని 39 రెవెన్యూ గ్రామాలకుగాను 38 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశామని తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. మండలంలోని వెదురుపల్లి, గుమ్మడిగొండ గ్రామాల్లో మంగళవారం డ్రోన్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేస్తున్నామన్నారు. సరుగుడు రెవెన్యూ గ్రామంలో డ్రోన్ సర్వే చేయలేదన్నారు. రీసర్వే వేగవంతం కావాలంటే రైతులంతా సహకరించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, సర్పంచ్ కాళ్ల సరస్వతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాళ్ల సత్యనారాయణ, ఆర్ఐ నారాయణరావు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.


వెదురుపల్లిలో డ్రోన్ సర్వే ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

మాడుగుల రూరల్: సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోలిమేర చంద్రరావు కోరారు. ఎం. కోటపాడులో మంగళవారం ఆయన మాట్లాడుతూ డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాడు–నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలకు రూపు రేఖలు తీసుకొచ్చిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే ఉపాధ్యాయులను ఉపాధ్యాయేతర విధులు నుంచి తప్పించాలని విజ్ఞప్తి చేశారు.

భయం వీడితేనే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధ్యం

విద్యార్థులకు డైట్ లెక్చరర్ మాధవి సూచన



మాట్లాడుతున్న డైట్ లెక్చరర్ మాధవి

చోడవరం రూరల్: పరీక్షల పట్ల విద్యార్థులు లేనిపోని భయాలను విడనాడాలని, ప్రశాంతంగా రాస్తే ఉత్తీర్ణతను సాధించడం సులభతరమవుతుందని భీమునిపట్నం డైట్ సైకాలజీ లెక్చరర్ జె.మాధవి సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు ‘పరీక్షా పర్వ్–4.0’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తరగతి గదిలో నేర్చుకున్న అంశాలే పరీక్షలో ప్రశ్నలుగా వస్తాయన్నారు. ప్రశ్నను సరిగా అర్థం చేసుకున్నట్టయితే సమాధానం రాయడం కష్టతరం కాదన్నారు. లేనిపోని భయాల జోలికి వెళ్లకుండా తాము చదువుకున్న అంశాలే పరీక్షలో రాయాల్సి ఉంటుందన్నారు. అనవసర భయాలకు చోటిస్తే, తెలిసిన ప్రశ్నలకు సైతం సమాధానాలు రాయడం కష్టతరమవుతుందని ఉద్బోధించారు. ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షలో ఒత్తిడిని జయించడం కోసమే ఈ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 11 నుంచి ప్రారంభమైన కార్యక్రమం 20వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన ప్రధానోపాధ్యాయిని బి.రవికళ మాట్లాడుతూ పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణతను సాధించడం ప్రధాన లక్ష్యమే అయినప్పటికీ ఎటువంటి ఒత్తిడిని దరి చేరనివ్వవద్దని సూచించారు. పలువురు విద్యార్థినులు అడిగిన పలు రకాల ప్రశ్నలకు సైకాలజీ లెక్చరర్ వివరణాత్మక సమాధానాలు ఇచ్చి వారిలో భయాలను తొలగించారు. సీఆర్పీ కె.ఎం. నాయుడు పాల్గొన్నారు.

సైన్సు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంటుపై శిక్షణ


సైన్సు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న జిల్లా రిసోర్స్ పర్సన్ నానిబాబు


మాట్లాడుతున్న డైట్ కళాశాల అధ్యాపకుడు నాగేశ్వరరావు

రోలుగుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రావికమతం, రోలుగుంట మండలాలకు సంబంధించిన సైన్సు ఉపాధ్యాయులకు సైన్సు లెర్నింగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా రిసోర్స్ పర్సన్ మాకిరెడ్డి నాని శిక్షణ ఇచ్చారు. సైన్సు ఎలా బోధించాలి, విద్యార్థుల్లో ఏ విధమైన ప్రేరణ కలిగించడానికి పాటించాల్సిన మెలుకువలు వివరించారు. రెండు మండలాల నుంచి 50 మంది సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సులభతర బోధనతో మంచి ఫలితాలు

కె.కోటపాడు: సోషల్ పాఠ్యాంశాన్ని విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో బోధించాలని కె.కోటపాడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం బి.ఎస్.ఎన్.మూర్తి సూచించారు. మంగళవారం స్థానిక హైస్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయులకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కె.కోటపాడు, చోడవరం, సబ్బవరం మండలాలకు చెందిన 54 మంది సోషల్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డైట్ కళాశాల అధ్యాపకుడు జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ మ్యాప్ పాయింటింగ్‌పై విద్యార్థులు ఆసక్తి పెంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్‌లో వెనుకబడిన విద్యార్థులను ముందస్తుగా గుర్తించి వారు మెరుగు పడేలా ప్రత్యేకంగా బోధించాలని సూచించారు. నోడల్ అధికారి ఆర్.వి.గిరి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల పండగలు


చిన అప్పనపాలెంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట: మండలంలోని చిన అప్పనపాలెంలో పైడితల్లమ్మ, శింగవరంలో గజ్జాలమ్మ అమ్మవారి పండగలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి రెండు గ్రామాల ప్రజలు డప్పులు, వాయిద్యాలు, నేలడాన్స్, భారీ మందుగుండు సామగ్రి కాల్చివేత మధ్యన కుటుంబ సభ్యులంతా ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గ్రామసభల ఆమోదంతోనే డెత్ ఓటర్ల తొలగింపు

నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగు అధికారి ప్రమీలాగాంధీ


వివరాలు తెలుసుకుంటున్న ఎన్నికల రిటర్నింగు అధికారి ప్రమీలా గాంధీ

రోలుగుంట: చోడవరం నియోజకవర్గంలో గ్రామసభల ఆమోదంతోనే ఓటర్ల జాబితా నుంచి 6,816 మంది డెత్ ఓటర్లను తొలగించినట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగు అధికారి ప్రమీలాగాంధీ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. మండల స్థాయిలో ఓటరు నమోదు, డెత్‌ల తొలగింపు కోసం పాటిస్తున్న విధానాలపై తహసీల్దార్ వెంకటేశ్వరరావుతో చర్చించారు. ఫారం –7 అమలులో కచ్చితమైన నిబంధనలు పాటించాలని సూచించారు. ఓటరు జాబితాలో ఇకపై డబుల్ ఎంట్రీ (ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు)కి ఆస్కారం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏదేమైనా చనిపోయిన వ్యక్తిని ఓటరు జాబితా నుంచి తొలగించేందుకుగాను గ్రామసభల ఆమోదం ఉండాలన్నారు. అతని కుటుంబ సభ్యుల వాంగ్మూలం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. డెత్‌లు, మైగ్రేషన్ ఓట్లపై అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల కోసం ఈ నెల 13 తేదీతో ముగిసిన గడువుతో మండలంలో 1,080 మంది ఓటర్లుగా నమోదు అయినట్టు డిప్యూటీ తహసీల్దార్ హెచ్.త్రివేణి వివరించారు.

నల్లమారమ్మ జాతరకు ఏర్పాట్లు

మాకవరపాలెం: స్థానిక నల్లమారమ్మతల్లి జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పండగ సందర్భంగా మంగళవారం అమ్మవారి గరగలను ఊరేగించారు. ఇక్కడ అమ్మవారిని స్థానికులతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఆరాధ్య దైవంగా కొలుస్తారు. ఈ మేరకు గురువారం జరిగే జాతరకు ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ సభ్యుడు గూడూరు వెంకటరాజు తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, భక్తులంతా హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ నేతలు చిటికెల రమణ, పోలిరెడ్డి రమణ, పెట్ల భద్రాచలం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


గరగలను ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రూ.70 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం


మోదమాంబ కాలనీలో నిర్మిస్తున్న సీసీరోడ్డు

మాడుగుల: స్థానిక మోదమాంబ కాలనీకి రహదారి సౌకర్యం లేక ముప్ఫై ఏళ్లగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంజూరు చేయించిన రూ. 70 లక్షలతో డ్రైనేజీలతోపాటు సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. కాలనీ వాసులు డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

నర్సీపట్నం: మహా శివరాత్రి ఉత్సవాలకు మున్సిపాలిటీ బలిఘట్టం ఉత్తర వాహినిలో మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న శివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి ఆదేశాల మేరకు వీరికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ ఘాట్లలో చెత్తాచెదారాలను యంత్రాలతో తొలగించి పరిశుభ్రంగా చేస్తున్నారు. పుణ్యక్షేత్రమైన ఉత్తరవాహిని నది ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.


యంత్రాలతో ఘాట్లను పరిశుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మాకవరపాలెం: వ్యక్తిగత ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారి సీతారామలక్ష్మి సూచించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులతో హెల్త్ మేళా, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రధానంగా విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు నిత్యం యోగా, ధ్యానం, సైక్లింగ్ చేయాలన్నారు. దీంతోపాటు గుండె, బీపీ, క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణ, నిరంతరం ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

వేతనదారులకు వైద్య పరీక్షలు

మాడుగుల: జాలంపల్లి పంచాయతీలో మంగళవారం 150 మంది వేతనదారులకు కింతలి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 80 మందికి సాధారణ వ్యాధులకు సంబంధించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వేసవిలో ప్రబలే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. సర్పంచ్ దారా మల్లేశ్వరి, మెడికల్ సిబ్బంది సీతారామరాజు, ఎంఎల్‌హెచ్‌పీ వసంత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగాది కల్లా ఇళ్ల నిర్మాణాలు పూర్తి

- ఎంపీడీవో యాదగిరీశ్వరరావు ఆదేశం

నాతవరం: ఉగాది కల్లా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శత శాతం పూర్తి చేయాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు ఆదేశించారు. తన కార్యాలయంలో మంగళవారం హౌసింగ్ జేఈ జోగారావుతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 56 జగనన్న లేవుట్లలో కొన్నిచోట్ల ఇళ్ల నిర్మాణాలు ఆశించిన విధంగా లేదన్నారు. సకాలంలో పనులు ప్రారంభించని లబ్ధిదారుల ఇళ్లు రద్దు చేస్తామన్నారు. ఇప్పటికే అలాంటి వారి జాబితా సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం సిమెంటు, ఐరన్, ఇసుక సరఫరా చేస్తుందని, డ్వాక్రా మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలు, సకాలంలో బిల్లులు అందిస్తుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

తాగునీటి సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం: మోటార్లు కాలిపోవడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. గిడుతూరు వద్ద వరాహనదిలో రూ.10 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్టు నుంచి 26 గ్రామాలకు నిత్యం తాగునీరు సరఫరా అవుతోంది. మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల తాగునీటిని పంపింగ్ చేసే మోటార్లు కాలిపోయాయి. దీంతో వారం రోజుల పాటు ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి తెలిపారు. ఈ మోటార్లకు వెంటనే మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు స్థానిక తాగునీటి సరఫరా వ్యవస్థల ద్వారా నీటిని అందించి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.


కాలిపోయిన ప్రాజెక్టు మోటార్లు

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం సంజీవయ్య 102వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ మధుసూదనరావు సంజీవయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సంజీవ య్య అణగారిన వర్గం నుంచి వచ్చినప్పటికీ స్వయం కృషితో ఎదిగారన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలి హరిజన ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా ఆ పదవులకే వన్నె తెచ్చారని కొనియాడా రు. కృషి ఉంటే ఏ స్థాయికైనా చేరుకోవచ్చేదానికి ఆయన జీవిత చరిత్ర నిదర్శనమన్నారు.

ధ్వజస్తంభానికి ఇత్తడి తాపడం పనులు

చోడవరం: అతి ప్రాచీన దేవాలయమైన స్థానిక స్వయంభూ గౌరీశ్వరస్వామివారి ఆలయంలో పునఃప్రతిష్ఠ చేసిన ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడ ఏడాది కిందట ఆలయ ధ్వజస్తంభం శిథిలమైపోయింది. దీంతో సోమిద వృక్షంతో తయారు చేసిన 40 అడుగుల పొడవైన ధ్వజస్తంభాన్ని ఇటీవల శాస్త్రోక్తంగా పునః ప్రతిష్ఠ చేశారు. దీనికి ఇత్తడి తాపడం పనులు చేపట్టారు. 220 కేజీల ఇత్తడిని ఇందుకు వినియోగిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతిరావు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గూనూరు సత్తిబాబు, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి పర్యవేక్షిస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 18వ తేదీలోగా ధ్వజస్తంభం ఇత్తడి తొడుగు పనులు పూర్తిచేసి ఆలయాన్ని ముస్తాబు చేసే విధంగా చర్యలు చేపట్టారు. మరో పక్క శివరాత్రి కల్యాణోత్సవాలకు ఆలయాభివృద్ధి కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.


ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

